- కథ -

# వేసవి నేస్తాలు

- వంగర లక్ష్మీకాంత్





వేసవి అంటే సెలవులు. సెలవులంటేనే సరదాలు. ఆ సరదాలు పండేది పల్లెల్లోనే. పల్లె సరదాల పంట కోసం అమ్మమ్మగారి ఊరెళ్లింది సృజన.

రవి, కిరణ్ మరికొంత మంది పిల్లలు కూడా అలాగే పల్లెకు వచ్చారు.

వచ్చారు అంటే ఊరకుంటారా! ఉంటే పిల్లలేనా! జట్టుకడతారు. ఆటలాడతారు. అల్లరి చేస్తారు. సందడి చేస్తారు. మమతల్ని పండించుకుని మరీ తిరిగి పోతారు.

వరి పిదప పెసర-మినుప పంట చాలా వరకు పీకేశారు. అక్కడక్కడ ఆవాల చెట్లు పూత పిందె మీద ఉన్నాయి.

పసుపు పచ్చగా పూలు.

మధ్యమధ్యలో ఖాళీగా చేలు.

వేసవి చేలు ఎంత విశాల ఆటస్థలమో !

బాలల ఆటలు అక్కడే.

ప్రతి సాయం షికారు కూడా అక్కడే.

పచ్చని తివాచీ పరచినట్లు బక్కెనాకు అల్లు కుంది. దానిపై పిల్లలు చతికిల పడ్డారు.

"పేలు... పేలు..." అంటూ బక్కెనాకులు సృజన తలమీద చిటపట కుక్కాడు కిరణ్. అవే ఆకులు "టపాకాయలు... అంటూ కిరణ్ తలపై టపటప లాడించింది సృజన. అందరూ పకపకా నవ్వారు.

ఆట - పాట..

అరుపు - కేక..

ఈల - గెంతు...

ఆడి ఆడి అలసిపోయారు భడవలు. ఆకలేసింది మిగిలిపోయిన పచ్చి పెసర-మినప కాయలు తుంచారు. వేరుశనగ మండలు పెరికి తెచ్చారు. పెద్దపిల్లలు పుల్లలు - ఎండుగడ్డి తెచ్చి గడ్డి వాము లకు దూరంగా తంపట పెట్టారు. ఆకలిగా ఉన్న ఆ పిల్లలకి తంపటకాయలు ఎంత రుచిగా ఉన్నాయో! అందరూ ఆత్రంగా తిన్నారు. సృజన కూడా మజా మజాగా తినేసింది.

మళ్లీ సందడి... మళ్లీ ఆటలు... పాటలు..

ఉరుకులు..... పరుగులు....

అలా ఆ పరుగు తాటి తోపుకు చేరింది. నోరు తెరచుకుని కాయల వంక చూడసాగారు. తాటి కాయలు.. తాటికాయలు.. అంటూ అరవటం మొదలు పెట్టారు.

కొంతమంది చెట్లెక్కి కాయలు దులపటం మొదలు పెట్టారు. తాటి గెల క్రింద పడటం ఆలస్యం ఈగల్లా ముసురుతున్నారు. చెట్టుదిగి వచ్చేసరికి ముంజెలన్నీ జుర్రేస్తున్నారు. ఇంకేం చెట్టు పైన వాళ్లు పైనే పళ్లతో పీకి ముంజెలు తినేస్తున్నారు ఇక కిందివాళ్ళు కేకలు పెట్టడం... అలా ఎండవేళ కడుపార చల్లని తాటి ముంజెలు మెక్కి సాయం వేళకి ఆకాశం క్రింద చతికిల బడ్డారు.

ఆకాశంలో వింత కాయలు ! రవ్వంత శోభ !

రకరకాల గడ్డిపూలు.

రంగు రంగుల సీతాకోక చిలుకలు.

తుర్రుమనే తూనీగలు.

తూనీగల వెనుక సద్దుచేయక చిన్నగా పట్టబోయే తుంటరి పిల్లలు.

అందీ అందకుండా అందంగా ఎగిరిపోయే గడుసరి తూనీగలు. ఈలలు వేస్తూ వెంటపడే బాలలు. ఆకాశంలో మేఘాలు పరుగులు పెడుతున్నాయి. రకరకాల ఆకారాలు అలా చూస్తూ చూస్తూ...

"అదిగో ఎద్దు" అన్నాడు కిరణ్

"రెండెద్దులు" రవి.

"ఏది? ఎక్కడ?...." అంటూ పరీక్షించారు.

"ఔను... అవి రెండూ పొడుచుకుంటున్నాయి..." అంది సృజన.

అలా చూడటం, పోల్చుకోవటం వేసవి సరదాల్లో భాగమే. ముఖ్యంగా పల్లెసరదాలు. పట్నంలో ఆకాశాన్నంటే టవర్ల మధ్య మచ్చుకి కూడా కానవీ సరదాలు. ఎండ వెన్నెలే అపురూపం అక్కడ.

"యురేకా...' అరిచారు ఎవరో...

అందరూ అటువైపుగా తిరిగారు.

"అక్కడ చీమల పుట్ట ఉంది"

"కనిపెట్టేశా... "అన్నారు పిల్లలు

"చీమల పుట్ట..." అన్నారు అందరూ.

"నేను చీమల భాష నేర్చుకున్నా" అన్నాడు కిరణ్. అందరూ ఆ వంక చూడసాగారు.

"ఝుం... ఝుం...." అన్నాడు కిరణ్

"ఝుం... ఝుం..." అన్నారు అందరూ.

అంతలో పెద్ద చీమ ఒకటి బయటికి వచ్చింది. బెల్లం ముక్క పెట్టారు పిల్లలు. మీసాలతో వాసన చూసి వెళ్ళి పోయింది. క్షణంలో చీమల దండు వచ్చింది. మీసాలు ఊపుకుంటూ బెల్లాన్ని చుట్టు ముట్టాయి. కేరింతలు కొడుతూ పిల్లలు మరికాస్త తుంచి పెట్టారు.

ఆనందంగా చీమలు పిల్లల చుట్టూ తిరగటం ప్రారంభించాయి.

\- - -

"ఝుం... ఝుం..." అంటూ పిల్లలు గెంతటం మొదలు పెట్టారు. ❖





# మనిషి ఒంటరికాదు

\- అడిగోపుల వెంకటరత్నమ్

మట్టి మొక్కకు గర్భాశయం
మట్టికి తెలుసు
మొక్కకు ప్రాణం పోయటం
పాటకు తెలుసు
పలు రూపాలు ఎత్తటం
జననం లోను
మరణంలోను
మధ్య మనుగడలోను
మనిషి ఒంటరి కాదు
పాట సహవాసం !
నీటిలో పక్షిలా
మనిషి మమేకమై
పాటతో క్రీడించాలి
ఖేదం తుడవటానికి
పాట తోడవుతుంది
మోదం పంచటానికి
పాట సాధనమవుతుంది
మనిషి కోసం పుట్టిన పాటను
మనిషి మరచినా
పాట మరవదు
అగడ్తలు తవ్వి
వైతరిణులు పారించి
కత్తులు ఖడ్గాలు చూపి
ద్వేషాలు వైషమ్యాలు
పాటను అడ్డుకుంటాయి
అడ్డుగోడగా నిలుస్తాయి !
ఉప్పొంగిన పాట
హృదిలో ప్రతిధ్వనిస్తుంది
రక్తనాళాల్లో ప్రవహిస్తుంది
వీక్షణంలో ప్రతిఫలిస్తుంది !
పాట మేఘమై
వర్షిస్తుంది
ఫలితం బీజమై
ప్రభవిస్తుంది ! ❖